క్లుప్తంగా

ముత్యాలమ్మకు జలాభిషేకం



ముత్యాలమ్మకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డి గూడెంలో కొలువైన ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శనివారం జలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని వర్షాలు బాగా కురిసి మంచి పంటలతో మెట్ట ప్రాంతం కళకళలాడాలని కోరుకుంటూ అమ్మవారికి సప్తనదీ జలాలతో, పంచామృతాలతో జలాభిషేకాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బ్రహ్మశ్రీ బాదంపూడి వెంకట సీతారామశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.1.85 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.1,85,000 విరాళంగా అందజేశారు. కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గుల్లా మంగరాజు దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి విరాళం బాండ్ పత్రాన్ని అందించి అభినందించారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

కుక్కునూరు: జూలై 5 నుంచి 7 వరకు చింతలపూడిలో జరిగే జిల్లా మహాసభకు మండలం నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. శనివారం కుక్కునూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో అడువులను జల్లెడ పడుతూ మావోయిస్టుల జాడ కోసం అభం శుభం తెలియని ఆదివాసీలను చిత్రహింసలకు గురిచేస్తున్నారని విమర్శించారు. కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

మమ్మల్ని ఆపేదెవడ్రా..

- మట్టి అక్రమ రవాణాకు అడ్డాగా దిప్పకాయలపాడు రాజు చెరువు
- ఇష్టానుసారంగా మట్టి తోలకాలు సాగిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



దిప్పకాయలపాడు రాజు చెరువులో నిర్వహిస్తున్న మట్టి తోలకాలు



రాజు చెరువు గట్టు తవ్వేసిన దృశ్యం

కొయ్యలగూడెం: మట్టి అక్రమ రవాణాకు దిప్పకాయలపాడు రాజు చెరువు అడ్డాగా మారింది. చెరువు గర్భంలో సైతం అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండడంతో అక్రమార్కులు అడ్డూ అదుపూ లేకుండా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ప్రభుత్వం మాది.. ఏం చేసినా మమ్మల్ని ఎవరాపుతారు.. అనే ధీమా అక్రమార్కుల్లో కన్పిస్తోంది. తాము ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తుంటే మట్టితోలకాలకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, కానీ మార్కింగ్ ఇవ్వకపోవడంతో ఇష్టానుసారంగా మట్టితోలకాలు చేస్తున్నారని, దీంతో భారీ గోతులు ఏర్పడుతున్నాయని ఆయకట్టు రైతులు అంటున్నారు. ముఖ్యంగా చెరువు గట్టు తవ్వి ట్రక్కుల రాకపోకలకు అనువుగా చేసుకున్నారని, దీనివల్ల వర్షాలు కురిస్తే చెరువులో చుక్క నీరు లేకుండా పోతుందని వాపోతున్నారు. ఈ మట్టిని వ్యవసాయ అవసరాలకు కాకుండా కమర్షియల్ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

చెరువు గట్టు సైతం ధ్వంసం

రాజు చెరువు గట్టులో ఇప్పటికే నీరు లేకుండా పోయిందని, పలుచోట్ల ఇష్టానుసారంగా తవ్వడం వలన పొలాలకు సాగునీరు అందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ చెరువు గట్టు కొయ్యలగూడెం, కన్నాపురం ప్రధాన రహదారికి ఆనుకుని ఉందని, చెరువు గట్టును ధ్వంసం చేయడం వలన వరదల సమయంలో రోడ్డు ముంపునకి గురై రాకపోకలు స్తంభిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. రాజు చెరువు ఇప్పటికే వివాదాస్పదంగా మారిందని రైతుల అవసరాలకు మట్టితోలకాల కోసం అనుమతులు అడుగుతుంటే భారీ స్థాయిలో మామూళ్లు ఇచ్చుకోవాల్సి వస్తుందని, అదే కమర్షియల్ అవసరాలకు అయితే ఆగమేఘాలపై అనుమతులు లభిస్తున్నాయంటూ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఇమ్మని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విషయం ఇరిగేషన్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దాని వలన పూర్తిస్థాయిలో మట్టి అక్రమ రవాణాపై దృష్టి పెట్టలేకపోతున్నామని పేర్కొనడం గమనార్హం.

గిరిజనులకు పోడు పట్టాలివ్వాలి



ఫారెస్ట్ రేంజర్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు: విలీన మండలాల్లో పోడు సరికి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం కుక్కునూరు ఫారెస్ట్ రేంజర్ కృష్ణకుమారికి వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా పోడుభూముల పైన ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులకు పట్టాలు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

కొయ్యలగూడెం: అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు శనివారం శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయం వద్ద పలువురు నాయకులు హాజరై జరిగిన దుర్ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు భారతావని అండగా నిలబడాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాల్లో నివారణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు జాతీయ రహదారిపై నగర శివారు ఆశ్రం బ్రిడ్జి, వ్యాసకాని రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో ఇటీవల బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ లైటింగ్ లేకపోవటాన్ని గుర్తించి విద్యుత్ దీపాలు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు పెట్టి వాహనదారులకు ప్రమాద హెచ్చరిక సూచీలను ఏర్పాటు చేశారు. శనివారం ఆయా ప్రాంతాల్లో సోలార్ స్ట్రీట్ లైట్స్ - 7, హెచ్చరిక సైన్ బోర్డులు - 4, స్పీడ్ లిమిట్ హెచ్చరిక బోర్డులు - 10 ఏర్పాటు చేశారు. వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని, వేగం కంటే ప్రాణం విలువైందని సూచించారు.

పరిసరాల శుభ్రత ద్వారా దోమల నివారణ



చింతలపూడి ప్రభుత్వ వసతి గృహంలో మలాథియాన్ మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి: పరిసరాల శుభ్రత ద్వారా దోమల నివారణ చేపట్టవచ్చునని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్ఏ ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో మలాథియాన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ పరిధిలోని 18 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో కీటక జనిత వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మలాథియాన్ ద్రావణం పిచికారి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ దోమల నియంత్రణ చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారులు, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె శ్రీనివాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, వీహెచ్ఎస్‌లు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

టి.నరసాపురం: పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. అనుబోలు మురళి అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రవి మాట్లాడారు. పొగాకు కొనుగోలు చేయకుండా సిండికేట్‌గా రైతులకు నష్టం చేకూర్చే విధంగా కొనుగోలు కేంద్రాల్లో దళారులు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పొగాకు రైతుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ పార్టీ కార్యదర్శి మడకం సుధారాణి, పార్టీ మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, బరగడ కుమారి, ముంద్రు శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి

ద్వారకాతిరుమల: యోగా క్రమం తప్పకుండా చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుందని ఎంపీడీవో జి.రాజమనోహర్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో డిప్యూటీ ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బెజవాడ రాణి, స్థానిక పంచాయితీ కార్యదర్శి జీటీవీ శ్రీనివాస్, సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

కొయ్యలగూడెం: ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో యోగ డ్రైవ్ నిర్వహించారు. యోగ శిక్షకులచే ధ్యానం, యోగాసనాలపై అవగాహన కల్పించారు.

టి.నరసాపురం: స్థానిక సచివాలయం-1 పరిధిలో శనివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జి.నాగరాజకుమారి మాట్లాడుతూ ఈ నెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద రక్తదానంపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బీబీ కమల మాట్లాడుతూ రక్తదానం.. ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ఏరియా ఆసుపత్రి హెచ్‌డీఎస్ కమిటీ మెంబర్లు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉన్న బ్లడ్ బ్యాంక్ సదుపాయాన్ని ఉపయోగించుకోవలన్నారు. ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావలసినప్పుడు ఇక్కడి నుంచి తీసుకెళ్లవచ్చన్నారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులను, రక్తదాతలను సన్మానించారు.

సత్యసాయి రథయాత్ర



యర్రంపేటలో రథయాత్రకు ఆహ్వానం పలుకుతున్న భక్తులు

కొయ్యలగూడెం: శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర శనివారం కొయ్యలగూడెం గ్రామంలో నిర్వహించారు. సత్య సాయి శతజయంతి వేడుకల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఈ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. యర్రంపేట, ఆరిపాటి, పొంగుటూరు, కన్నాయిగూడెం, కొయ్యలగూడెం గ్రామాల్లో నిర్వహించిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని సాయిబాబా కీర్తనలు ఆలపించారు.



విద్యాకేంద్రంగా జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం: మెట్ట ప్రాంతంలో విద్యాకేంద్రంగా జంగారెడ్డిగూడెం విరాజిల్లుతోంది. చింతలపూడి నియోజకవర్గంలో ప్రముఖ పట్టణం, వ్యాపార కేంద్రంగా ఉన్న జంగారెడ్డిగూడెం విద్యారంగంలో కూడా ముందుంది. ప్రాథమిక, సాంకేతిక, ఉన్నత విద్యను అందించే పాఠశాలలు, కళాశాలలు పట్టణంలో నెలకొని ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో విద్యా రంగం దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలు, పాఠశాలలతో పాటు, ప్రైవేట్ రంగంలో సైతం పేరొందిన పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడ విద్యను అభ్యసించేందుకు విద్యార్థులు వస్తున్నారు. జంగారెడ్డిగూడెం చుట్టుపక్కల ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో ఇక్కడ విద్యారంగం అభివృద్ధికి దోహదపడుతోంది. పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో అనేక మంది విద్యార్థులు వీటిని ఉపయోగించుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోనే సుమారు 10కి పైగా అతి పెద్ద విద్యాసంస్థలు ఉన్నాయి. విద్యా ప్రమాణాలతో పాటు సదుపాయాలు పెరగడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అభ్యాసన జరుగుతోంది. వసతి, బస్సు సదుపాయాలు కల్పించడం వల్ల దూర ప్రాంతాల వారికి విద్య చేరువైంది. పేద, మధ్యతరగతి పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి.

26న సర్వసభ్య సమావేశం

టి.నరసాపురం: ఈ నెల 26వ తేదీన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.నాగరాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖల్లో సాధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

19న జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: వర్షాలు సమృద్ధిగా కురవాలని ఈనెల 19వ తేదీన విజయదుర్గమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.